# అందాల వ్యాపారం

—బడబాగ్ని శంకరరాజు

ఆది శ్రీనివాసరావు ఇల్లు. ఇంటి ముందర కూర్చొని అప్పుడప్పుడూ ఇంటి లోకి తొంగి చూస్తూ గుసగుసలాడుతున్న ఇరుగు పొరుగు అమ్మలక్కలు.

ఉన్నంతలో అందంగా సర్ది వున్న మధ్య గదిలో సోఫాలలో ఠీవిగా కూర్చుని వున్న నలుగురు అతిథులు, వారి ముందు టీపాయి మీద ప్లేట్లలో పేర్చబడిన ఆవురావురు మనిపించే రకరకాల స్వీట్లు. చూపులకు అంతే ఆతృతను కలిగిస్తూ మోకాలి మీద చుబుకాన్ని అంటీ అంటనట్టు ఆన్చి నేలచూపులు చూస్తూ కూర్చొని వున్న అందాల రాశి ఉష. అతిథుల్నీ అమ్మాయినీ మార్చి మార్చి చూస్తున్న అమ్మాయి తల్లిదండ్రులు - ఇవన్నీ అక్కడ జరుగుతున్నది పెళ్ళి చూపుల తతంగం అని చెప్పక చెబుతున్నాయి.

కొత్త బట్టల తళతళలో తల్లిదండ్రుల మధ్య అందమైన పాకేజీలో అమ్మకానికి సిద్ధం చేసిన రేటు ముద్రించని అమ్మకం వస్తువులా కూర్చొన్న, అంత కురూపిగాని ఆ యువకుడు, ఆ అమ్మాయి అందాల్ని కళ్ళతోనే తాగేశాడు కాబోలు రెండు స్వీట్ల కంటే ఎక్కువ తీసుకోలేదు. పెళ్ళిళ్ల పేరయ్య, అతని తల్లిదండ్రులే అన్నీ లాగించేసారు.

ఇంతలో మెరుపు మెరిసినట్టుగా ఒక అమ్మాయి కాఫీ ట్రేని వారి ముందు వుంచి అదృశ్యమయింది. నవనవలాడే మేనిఛాయ బంగారు కాంతులతో వాళ్ళ కళ్ళు జిగేల్‌మన్నాయి.

ఆ కాంతులలో ఆ యువకుడి చూపులను అంతవరకూ అలరించిన అందాల రాశి వెల వెల బోయినట్టు అనిపించింది.

కొడుకు భావాల్ని క్రీగంటి చూపులతో చదివేసారు అతని తల్లిదండ్రులు.

పెళ్ళి చూపులు అయిపోయినట్లుగా, అతిథి బృందం బయటికి నడిచింది. వాళ్ళ వెనుకే, శ్రీనివాసరావు దంపతులు రెట్టించిన ఉత్కంఠతో అనుసరించారు.

"కట్నం విషయం, పేరయ్య గారు మీకు చెప్పే వుంటారు".

"మా శక్తికి మించిందండీ. అయినా..." నసిగాడు శ్రీనివాసరావు.

"మీ శక్తికి మించిందని అనిపిస్తే లాంఛనాలు సగం తగ్గించేస్తాన్లే, ఏం చేద్దాం మరి..!" భార్య వేపు చూసి పెదవి విరుస్తూ అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

"మీది ఎంత పెద్ద మనసండీ!" గొణుక్కుంటున్నట్టుగా అన్న శ్రీనివాసరావుకు 'కట్నం తప్ప లాంఛనాలేవీ వాళ్ళు తీసుకోరటండీ' అన్న పేరయ్య మాటలు గుర్తు కొచ్చి, వెంటనే నాలి క్కొరుక్కున్నాడు.

"మీ పెద్దమ్మాయి కంటే రెండు రెట్లు అందగత్తె అయిన మీ చిన్నమ్మాయిని మా ఇంటి కోడలిగా చేసుకోవడానికి ఆ మాత్రం త్యాగం చెయ్యలేమటండీ" అప్పుడే వచ్చి ఆగిన ఆటో ఎక్కుతూ అన్న పెళ్ళికొడుకు తల్లి మాటలకు - శ్రీనివాసరావు దంపతులు 'చిన్నమ్మాయిని వాళ్ల ముందుకు పంపి ఎంత పొరబాటు చేసాం!' అని అనుకొంటూ డ్...ర్....ర్ర్ మని కదలిపోతున్న ఆటోను నిర్లిప్తంగా చూస్తుండిపోయారు.

* * *

ఇంటర్వ్యూకు వచ్చింది ఇద్దరే అయినా, ఆ వచ్చిన రెండో అమ్మాయి కీర్తికి తనకంటే విద్యార్హతలు ఎక్కువగా వున్నట్టు సంభాషణలో తేలింది. అందువల్ల తనకు ఈ పర్సనల్ సెక్రటరీ ఉద్యోగం లభిస్తుందనే ఆశ ఏ మాత్రం లేకున్నా 'ఈ ఉద్యోగం తనకే గనుక వస్తే - చెల్లి పెళ్ళికి చేసిన అప్పు తీర్చి, కుటుంబ ఆర్థిక పరిస్థితుల్ని కొంతైనా మెరుగు పరుచుకోవచ్చు' అన్న ఊహలతో ఇంటికి చేరుకుంది- పట్టణం లోని ఒక ప్రముఖ ఫైనాన్సింగ్ కంపెనీలో పర్సనల్ సెక్రటరీ ఉద్యోగానికి జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొనడానికి వెళ్ళిన ఉష.

అక్కడ ఆఫీస్‌లో ఇంటర్వ్యూలు జరిగిన వారం రోజుల తరువాత-

"రాఘవయ్యా!" అన్న మేనేజర్ సాయికిశోర్ పిలుపు విని "ఎస్ సర్" అంటూ వచ్చి మేనేజర్ ముందు నిలబడ్డాడు ఆఫీస్ గుమస్తా.




"ఉష పేరు మీద అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ ప్రిపేర్ చేయించి, ఆ అమ్మాయికి పంపండి"

"సార్ ఆ అమ్మాయికంటే కీర్తికే...."

"ఎక్కువ విద్యార్హతలు వున్నాయంటావ్. అంతే కదా! నిజమే! ఇంతవరకూ మన కంపెనీలో అర్హతలను బట్టే ఉద్యోగాలలో నియమించే వాళ్ళం. కానీ మైడియర్ ఓల్డ్‌మాన్! ఇప్పుడు కాలం మారిపోయింది. కస్టమర్స్, కంపెనీ పార్ట్నర్స్ అభిరుచులు వేగంగా మారిపోతున్నాయి. మనమూ మారాలి తప్పదు. నా ఫైనాన్సింగ్ కంపెనీలో పర్సనల్ సెక్రటరీగా జాయిన్ కాబోయే అమ్మాయికి విద్యార్హతలొక్కటే చాలవు! వాటికి దీటుగా అందమూ వుండాలి. అటువంటి అమ్మాయి నా పక్కన నిలబడినప్పుడే మన బిజినెస్ వేగం పుంజుకొంటుంది. మన కంపెనీలో పెట్టుబడి పెట్టడానికి వాటాదారులు పోటీబడి ఎగబడతారు. ఎందుకంటావ్? మనం వాళ్ళకిచ్చే వడ్డీ కోసమే కాదు. దానితో పాటు మనం వాళ్ళకందించే పడతి అందాల "కొసరు" కోసరమే! ఈజ్ ఇట్ నాట్?" తన మాటలను మధ్యలోనే తుంచేస్తూ ఉపన్యాస ధోరణిలో అన్న మేనేజర్ మాటలకు – అంగీకారంగా తలూపుతూ వెళ్ళిపోయాడు, బాస్ ఆదేశాన్ని అమలులో పెట్టడానికి రాఘవయ్య.

* * *



"వీలుపడదంటే వీలుపడదు మేనకా" ఉదయాన్నే వణికిస్తున్న చలిని లక్ష్యపెట్టకుండా పెట్టుబడుల కోసం పట్టణ ప్రముఖుల్ని కొందర్ని కలవడానికి కొత్తగా అప్పాయింట్ చేసుకొన్న పర్సనల్ సెక్రటరీ ఉషతోపాటు ఆఫీస్‌కు వచ్చిన సాయి కిశోర్, ఆ సమయంలో ఊహించని కస్టమర్‌ను చూసి విసుక్కొంటూ అన్నాడు.

"అలాగనకండి సార్! ఇంతకుమునుపు ఎన్నిసార్లు మా 'కంపెనీ'కి మీరు అప్పు ఇవ్వలేదు. వడ్డీతోసహా అవన్నీ చెల్లించేసామా, ఉంచుకున్నామా? అందునా మీకు హామీ సరుకునుకూడా చూపించాను కదా. ఒక లక్ష రూపాయలు పెట్టి ఫర్నిచర్‌తో అలంకరించిన ఇంటిలో ఆ నలుగురు అందాల బొమ్మల్ని నిలబెడితే సంవత్సరం తిరక్కుండానే రెండు లక్షల ఆదాయం సంపాదించి పెడతారు. అట్లాంటి సరుకు మీద ఒక లక్ష రూపాయలు అప్పు ఇవ్వడానికి మీరెందుకింత హైరానా పడిపోతున్నారో నాకు బోధపడలేదు" అని గడ్డం క్రింద చేయి ఆన్చి జర్దా కిళ్ళీతో ఎర్రబడిన నోరంతా కనబడేటట్టుగా తెరచింది ఆశ్చర్యం ప్రకటిస్తూ 'పెదపట్నం' మేనక.

"అదేంకాదు మేనకా! ఉన్న డబ్బంతా ఇప్పటికే కంపెనీలకు ఇచ్చేశాము. ఇక వున్న లక్షో రెండు లక్షలో మీకే ఇద్దామని అనుకొన్నాం. కానీ... మీ కంపెనీ అమ్మాయిల్ని తలదన్నే అందగత్తెలు ఊర్వశి కంపెనీలో వున్నారనే కబురు విన్నవే మా గుమస్తా నా చెవినేశాడు.

విటుల వద్ద నుంచి కనకవర్షాన్ని కురిపించగల అందాల్నే కదా మేము హామీగా భావించుకొని అప్పులిస్తాము. మరి మా కంపెనీ వ్యాపార సూత్రాలు. అలాంటివి. ఏం చేద్దాం! వాటిని అతిక్రమిస్తే మా కంపెనీ పునాదులు కదిలిపోవూ" అని వ్యాపార నీతిని వల్లించిన సాయి కిశోర్, ఇక చర్చకు అవకాశం ఇవ్వడం ఇష్టం లేనట్లు–

"ఉషా! కాంట్రాక్టర్ కనకరాజు దగ్గర తీసుకోబోయే పెట్టుబడి తాలూకూ పేపర్లు తీసుకొని నాతోరా!" అంటూ బయటికి నడుస్తున్న వాడల్లా ఉష దగ్గర టక్కున ఆగి–

"నీలాంటి చార్మింగ్ గాళ్ నా ప్రక్కనుంటే రెట్టింపు పెట్టుబడులు అందుతాయి. అప్పుడు నీకు బోనస్ రెట్టింపు... అండర్‌స్టూడ్. కమాన్... కమాన్ యంగ్‌గాళ్!" తనకు వినబడేట్లుగా అని హుషారుగా బయటికి నడుస్తున్న మేనేజర్‌ను దీనంగా అర్థిస్తూ అనుసరించింది మేనక.

ఆ దృశ్యాన్ని చూసిన ఉషకు పెళ్ళి చూపులలో తనను చూడడానికి వచ్చి, తన చెల్లిని చేసుకొంటామని పెళ్ళివారు అన్న మాటలు తన చెవిని సోకినప్పుడు తనలో కలిగిన నిరాశా భావానికి సాదృశ్యం అనిపించింది– మేనక కళ్ళలో కదలాడుతున్న నిరాశా 'భార'జలం.

జీపు స్టార్ట్ అయిన శబ్దం విన్న ఉష చకచకా నడుచుకువెళ్ళి మేనేజర్ ప్రక్కన కూర్చున్నాక ఆగిపోయిన ఆలోచనలు మళ్ళీ స్టార్ట్ అయ్యాయి.

పెళ్ళి చూపులలో తనకు తెలియకుండానే రంగప్రవేశం చేసిన అందాల వ్యాపారం, అప్పుడు సంసార జీవితం మెట్టు ఎక్కనివ్వకుండా చేసింది. తరువాత ఉద్యోగం కోసం జరిగిన ఇంటర్వ్యూ సమయంలో విప్పిన తన సమస్య ముడి మరొక సాటి స్త్రీ కీర్తి జీవితంతో బిగిసినట్టయింది. దానివలన తనకు ఉద్యోగం లభించినా తన జీవితంతో లాభాల ఆట ఆడుకోవడం మాత్రం అది మానలేదు. క్రమక్రమంగా తన మానసిక ప్రపంచాన్ని "అందాల వ్యాపారం" కరెంటు తీగెల ఉచ్చు ముడులతో బిగించి వేస్తున్నా, తను నిర్లిప్తంగా వుండిపోతోంది ఎందుకో?

'నన్ను జీవితంలో ఒక మెట్టు ఎక్కించిన ఈ అందాల వ్యాపారం ఇప్పుడు జీవితపు విలువలకు తనను ఎంతదూరంగా నెట్టివేయబోతోందో!' అనే ఆలోచన కలిగించిన జలదరింపు వలన కాబోలు, ఉష జర్క్ ఇచ్చినట్టు కదలడంతో పక్కనే కూర్చొని వున్న మేనేజర్ భుజానికి తన భుజం తగిలింది. ఆ స్పర్శకు తలతిప్పి ఆమె వేపు చూసి "చలి వణికించేస్తోంది కదూ!" అని "వద్దు సార్" అంటున్నా వినిపించుకోకుండా తన ఉలెన్ స్వెట్టర్ తీసి ఉష వంటి మీద కప్పాడు మేనేజర్....

జలదరిస్తున్న జీవితపు విలువల మీద వ్యాపార విలువల ముసుగు కప్పినట్టుగా. ◆